


# మాతృదేవ్యైనమః

"సింహాం"

ఈ వేళ ఉదయం నుండి ముసురుగా వుంది.

నరసింహావధాన్లుగారు జపం ముగించుకుని దేవతార్చన ముందు నుండి లేచారు.

అప్పుడు ఉదయం సుమారు ఎనిమిది గంటలవుతుంది.

ఆయన దేవుడి పీఠం ముందు నుండి లేవగానే ఆయన ధర్మపత్ని సూరమ్మగారు గ్లాసుడు వేడి పాలు అందించేరు.

ఆ పాలు తాగి ఆయన ఉత్తరీయం పైన వేసుకుని పొన్ను కర్ర చేత్తో పట్టుకుని బైటికి నడిచారు.

"ఏమేవ్! నేను వరహాలు పెదనాన్న గారింటికి వెళ్తున్నాను. తలుపేసుకో."

లోపలికి కేకేసి గుమ్మం దిగారు.

"జాగ్రత్త! చినుకులు పడుతున్నాయి. గొడుగేసుకుని వెళ్ళకూడదూ!"

భర్త మీదున్న అనురాగమంతా ధ్వనించింది సూరమ్మగారి గొంతులో.

"ఏమిటో! దీని పిచ్చి!" అనుకుంటూ పాంకోళ్ళు టక్‌టక్ లాడించుకుంటూ కదిలారు నరసింహావధాన్లుగారు.

నరసింహావధాన్లుగారు వేద పండితుడు. శ్రోత్రియమైన బ్రాహ్మణుడు. అభోజనమైనా సహిస్తారు గాని అనాచారాన్ని సహించరు.

వేదం ఎనభై రెండు పన్నాలూ తలక్రిందులుగా కూడా చదవగలరు. ఇప్పటికీ ఆయన చాలా మంది శిష్యులకు వేదం చెబుతూ వుంటారు. ప్రతిరోజూ తెల్లవారు జామున నాలుగ్గంటలకు స్నానాదికాలు కానిచ్చి వేద పఠనానికి కూర్చుంటారు. ఆయనతోబాటు ఆయన శిష్యులు కూడా వల్లిస్తూ వుంటారు. అటువంటి భర్తని పొందడం తన పూర్వ జన్మ సుకృతంగా భావిస్తూ వుంటారు సూరమ్మగారు.

ఆయన వేదం చదవని రోజు కూడా ఆ లోగిలిలో-వేదఘోష వినబడుతూనే వున్నట్లుంటుంది ఆ వూరి ప్రజలకి.

నరసింహావధాన్లుగారు పుట్టుకతో ధనవంతుడే. కాని పుట్టిన సంవత్సరానికే తండ్రిని పోగొట్టుకున్న దురదృష్టవంతుడు. దాయాదులు ఆస్తి లాక్కున్నారు. కట్టు బట్టలతో చంకలో బిడ్డతో నడివీధిలో నిలబడి పోయిన సోమిదేవమ్మని ఒక

పుణ్యాత్ముడు చేరదీశాడు కన్నకూతురి లాగ ఆదరించాడు అతనే నరసింహావదాన్లు గారికి విద్యాబుద్ధులుచెప్పించాడు తనంత పండితుడ్ని చేశాడు ఆయన నిస్సంతు తన ఆస్తినంతా నరసింహావధాన్లు గారికే ఇచ్చాడు ఏడవ సంవత్సరంలోనే ఉపనయనం చేసి నాలుగు వేదాలు శృతిస్మృతి పురాణేతి హాసాన్ని కంఠోపాఠం చేయించాడు ఆయన కాలధర్మం చేసాక సాంప్రదాయమైన కుటుంబంలోంచి సూరమ్మగారిని తెచ్చి అవధాన్లు గారికి వివాహం చేసారు సోమిదేవమ్మగారు

అయితే మనుమల ముద్దు ముచ్చట్లు చూడకుండానే కన్నుమూసారావిడ

రేపు ఆమెగారి అబ్దికం

తండ్రిలేని తనను ఇంత వాడిని చేసిన తల్లి సోమిదేవమ్మగారంటే నరసింహావదాన్లుగారికి ఎనలేని ప్రేమ. దానికి రెట్టింపు భక్తి

ఆయనకి జ్ఞానం వచ్చిన తరువాత ఏనాడూ తల్లి మనసు నొప్పించి ఎరుగరు మాతృదేవో భ్యోనమ - అనే నీతితో వాక్యాన్ని మహామంత్రంగా పఠించి అవగాహన కలిగి ఆకళింపు చేసుకున్న మహామనీషి ఆయన

ఆయన కొడుకులు కూడా అంతటివారే తులసి వనంలో తులసి మొక్కలే పుట్టాయి పండతుడకడుపున 'పండిత పుత్రులు పుట్టలేదు పండిత శ్రేష్టులే పుట్టారు అయితే వాళ్లది ఆధునికమైన విద్య పట్టణాలలో పెద్ద పెద్ద ఉద్యోగాలు చేస్తున్నారు కొడుకు లిద్దరూ

వేద వేదాంగ విశ్లేషణ, తర్క మీమాంసలు భగవద్గీత వాఖ్యానము సరళ గంభీర స్వరంతో ఆయన నోటి నుండి వెలువడుతూ వుంటే చూసి మురిసి పోయి చుట్టు ప్రక్కల గ్రామాల నుండి కూడా ప్రజలు వచ్చి అవి విని తరిస్తూ వుంటారు వాటిని వ్యాఖ్యానం చేసేటప్పుడు ఆయన మాటల్లో సమత మమత సమపాళ్లలో కనిపిస్తూ వుంటాయి అయినా ఆయనకి దగ్గరగా వెళ్లడానికి ఎవరూ సాహసించరు ఎవరైనా మూడుగజాల దూరంలో నిలబడి మాట్లాడవలసిందే గాని ఆయనకి దగ్గరగా వెళ్లరు చివరికి ఇంట్లో పని చేసే వాళ్ళు కూడా కొంచెం అవతల నుండ మాట్లాడవలసిందేగాని ఆయన ఎదుటపడడానికి ధైర్యం చెయ్యరు అలాగని వాళ్ల మీద ఆయనెప్పుడూ ఆంక్షలు విధించలేదు ఆయన మీద భక్తి గౌరవాలే వాళ్ల చేత అలా చేయిస్తూ వుంటాయి

దబ్బపండు శరీర ఛాయతో, ఆరడుగుల భారీ విగ్రహంతో, మన్ననితల, వెనుక నల్లనిచిక్కని శిరోజాలతో పిలక, చెవులకు కుండలాలు, ముంజేతులకు కంకణాలు వ్రేళ్లకు ఉంగరాలు, చేతిలో-బంగారపు పొన్నుగలిగిన చేతికర్ర, మెళ్లో వెండి తీగలతో చుట్టిన నూటెనిమిది పూసల రుద్రాక్షమాల ఎడమ జబ్బ మీంచి కుడిచేతి క్రిందకు వ్రేలాడే యజ్ఞోపవీతం, కాళ్లకు కడియాలు, నుదుటి మీద జబ్బలమీద, చేతుల మీద, వక్షంమీద, దండల మీద విభూదిరేఖలు, పట్టు పంచ కట్టుకుని పట్టు ఉత్తరీయం పైన వేసుకుని, పచ్చని పాదాలు పాంకోళ్ల రంగుతో కలిసిపోగా మత్తగజం లాగ, అపర శ్రీనాధుడి లాగ నడుచుకుంటూ వీధివెంట వెళ్తూ వుంటే సాక్షాత్తు సదాశివుడే సరాసరి దిగివచ్చినట్టుంటుంది ఆ వూరి వారికి

చినుకుల్లోతడుసుకుంటూ వచ్చిన నరసింహావధాన్లుగారిని చూడగానే ఆనందంతో ఎదురొచ్చారు వరహాలుగారు

'పెదనాన్నగారూ! కులాసాయేనా!

వినయంగా నమస్కరించి పలుకరించారు అవధాన్లుగారు

' భగవంతుడి దయవలన బాగానే వున్నాను ఏమిటి ఇలావచ్చావు? ఉరక రారు మహాత్ములన్నారు!"

చిరునవ్వుతో ఆహ్వానించారు వరహాలుగారు

వరహాలుగారు చూపించిన కుర్చీలో కూర్చుని-

మీకు తెలియందేముంది రేపు మా అమ్మగారి అబ్దికం మీరు మంత్రానికి రావాలి

అర్ధించారు అవధాన్లుగారు

వరహాలుగారు అవధాన్లు గారికన్నా ఇరవై ఏళ్ల పెద్ద ఎనభై అయిదు సంవత్సరాల వరహాలుగారు ఒంట్లో ఓపికలేక ఎక్కడికీ వెళ్లడం మానుకున్నారు కాని వచ్చి అడిగింది మహాపండితుడు తనకు అప్పుడు అయిన నరసింహావధాన్లుగారు నరసింహావధాన్లు గారింటికి వెళ్లడానికి వరహాలుగారికి సరదాయే గాని ఆయనంత పండితుడు కాదీయన ఈయనకి స్మార్తం వొచ్చు కాని ఏ మాత్రం క్రియలో లోపం జరిగినా అపస్వరం పలికినా నరసింహావదాన్లుగారు ఊరుకోరు అదీ వరహాలు గారి బెదురు అయినా అవధాన్లుగారి అభ్యర్ధన కాదనలేక-

అలాగేలేరా నరసింహా! సాక్షాత్తు పరమశివుడిలాంటి నువ్వొచ్చి తల్లి తద్దినం అని పిలిస్తే రాకుండా వుండగలనా! అయితే ఒక షరతు నేను పితృశేషం తినను కోడలు పిల్లతో చెప్పి వేరే వంట చెయ్యమను అన్నట్లు కొడుకులు కోడళ్లు పిల్లలు-అంతా వస్తూన్నట్లేనా!

మాట మళ్లించి పొడుం దట్టించేరు వరహాలుగారు

ఆ అంతా వస్తున్నారు తమ్ముడు లక్ష్మణావధాన్లుకి కూడా ఉత్తరం రాసేను వాడు మరదలు కూడా వస్తారు అయితేసరే మీరు కోరినట్లే ఏర్పాటు చేయిస్తాను మరి నే వస్తాను

బయల్దేరారు అవదాన్లుగారు

మరి భోక్తల మాటేమిటి?

భోక్తలు ఎవరు అన్న అర్ధంతో అడిగేరు వరహాలుగారు

దీక్షితులగ్రహారంకి శిష్యుల్నిపంపించేను వాళ్లిపాటికి కుదిర్చేసే వుంటారు

జవాబు చెప్పి ఇంటికి చేరారు అవధాన్లుగారు

ఇంటికి వచ్చేసరికి వంట పూర్తయింది

అనుష్టానం గానిచ్చి మహానైవేద్యం పెట్టి భోజనానికి కూర్చున్నారు అవదాన్లుగారు

అవదానిగారి భోజనం అవుతూడంగానే పట్నం నుండి కొడుకులు కోడళ్లు మనమలు అంతా వచ్చారు

భోజనం కానిచ్చి ఓ ఘడియ విశ్రమించేరు

ఆయన పడుకుని లేచేసరికి దీక్షితు లగ్రహారం వెళ్లిన శిష్యులు వచ్చారు అదే సమయానికి లక్ష్మణావధానీ అతని భార్య కూడా వచ్చారు

శిష్యులు వెళ్లి బిలుసుకూర పనసకాయ,



# ప్రశ్నావళి

**కె. రామలక్ష్మి**

## పి. ఆర్. – ఇల్లెందు

ఆంధ్రప్రదేశ్‌ను మళ్ళీ కాంగ్రెస్ చేపడుతుందా?

★ ఇప్పుడున్న నాయకులతోనా? అసంభవం! వాళ్ళంతా! 'ఒక పార్టీ వాళ్ళం' అన్న విషయాన్నే మరిచిపోతున్నారు

ప్రేమలో మగవాడు మోసం చేస్తే ఆడది భరించకల్గుతుంది కాని అదే ఆడది మోసం చేస్తే మగవాడు భరించలేడు ఎందుకని?

★ మగవాడు కదా? అందుకని ఆడదానికి భూదేవికి ఉన్నంత ఓర్పుండాలని కదా అందరి నమ్మకం- అందుకని ఆమె భరించాలి!

## డి.ఎన్.ఆర్, డి.వి.ఎల్. – మిట్టపల్లి

స్త్రీకి పెళ్ళయినట్టు గుర్తు మాంగల్యం మరి పురుషుడికి?

★ నలభై దాటితే చెప్పవచ్చు- వెర్రి వేషాలు వేయడం ప్రారంభిస్తారు కనుక!

## వి. పి. బి. – గుంటూరు

మీకు కూడా యండమూరి, చిట్టారెడ్డి-లాటి క్షుద్ర సాహిత్యం రాయాలనే ప్లాన్ ఏదైనా వుందా?

★ లేదు బాబోయ్! నేను రోజ్‌మేరీస్ బేబీ, డామియన్-2 లాంటివి సెన్సారులో చూసే- హడలి చచ్చాను అసలలాంటి సాహిత్యం నేనెప్పుడూ చదవలేదు చదవను మనం రాసేవి, చదివేవీ మన మనస్సుని రెస్ట్‌లెస్‌గా చేస్తాయని- నేను అనుకుంటాను

## పి. యు. ఎమ్. – విశాఖపట్నం

మీది ప్రేమ వివాహం కదూ? తొలి చూపులోనే ప్రేమించారా

★ లేదు- నాలుగేళ్ళు స్నేహించాం!

ప్రేమించిన హృదయం ఎదుటివారి తిరస్కారం భరించలేదా?

★ ప్రేమించినప్పుడే హృదయం దెబ్బ తిందని అర్థం- యింక దాని కితర బాధలు తెలియవు

## పి. జె. – నంద్యాల

అక్కయ్యా, మీ ప్రశ్నావళి శీర్షిక అంటే నాకు ఎంతో యిష్టం నేను కథలు రాశాను. పత్రికకు పంపాలని వుంది, మీ ఆశీర్వాద బలం నాకెంతో చేయూత

★ ఆశీర్వాదానికేం – శుభం పంపించు చిట్టి తల్లీ ఈ నిచ్చెన ఎవరూ ఎక్కించలేరు – ఎవరికి వారే ఎక్కాలి!

## ఎమ్. వి. కె. – సికింద్రాబాదు

అబద్ధం ఆడితే- ఓ పట్టాన ఒప్పుకోరు సరికదా దానికికో అబద్ధం ఆడతారెందుకు?

★ అదే విచిత్రం అబద్ధాలు- సజీవ లక్షణాలున్నవి ప్రతి ఒక్కటీ విత్తనం వేస్తుంది- వచ్చే తరానికి అందుకే- ఆడకుండా వుండాలంటే- తొలిసారే- ఆడకుండా వుండాలి అసత్యం □

---

# మాతృదేవ్యైనమః

పనసాకులు తీసుకు వచ్చారు పనసకాయ కొట్టి పొట్టు చేసేరు పనసాకులు విస్తళ్ళుకుట్టేరు

సాయంత్ర మయింది

వర్షం బాగా ఎక్కువైంది

రాత్రయింది అందరివీ భోజనా లయేయి వర్షం ఇంకా ఎక్కువైంది

వీధి గదిలో కొడుకులు, కోడళ్ళు మనవలు, తమ్ముడు మరదలు భార్య– అందరితో కొలువు తీర్చేరు అవధాన్లుగారు

"ఏమర్రా! మా అమ్మ కాకరకాయ కాశీలో వొదిలేసింది రేపటికి ఆ కూరగాని తేలేదు గదా!

అనుమానంగా అడిగేరు అవధాన్లుగారు

"లేదండీ! మాకామాత్రం తెలీదంటారా!"

సమాధానం చెప్పేడు పెద్ద కొడుకు

భూన భోంతరాళాలు బ్రద్దలయేలా పిడుగు పడింది ఎక్కడో గాలి మహావృక్షాలను సైతం పెల్లగించి వేస్తోంది

ఇంతలో అవధాన్లుగారి శిష్యుడు రామశర్మ వర్షంలో తడుసుకుంటూ వచ్చాడు

"ఏరా శర్మ ఇలా వచ్చావు?

అనుమానంగా అడిగేరు అవదాన్లుగారు

"గురువుగారూ! నది పొంగుతోంది ఈ వర్షం ఇలాగే కురిస్తే అర్ధరాత్రికి నదికి వరదొచ్చి ఊళ్ళోకి నీళ్ళొచ్చేస్తాయి!

అమ్మో! అయితే రేపు తద్దినం!

సూరమ్మగారు గుండెల మీద చెయ్యేసుకున్నారు

ఇలాగైతే రేపు రావలసిన బ్రాహ్మళ్ళు రారే!

పెద్ద కోడలు మరింత ఆందోళన పడింది

అవధాన్లుగారు వింటున్నారు రేపు తల్లి తద్దినం అబాసయిపోతుందేమోనని ఆలోచించడం లేదాయన

నది వొడ్డున కాపురాలున్న వాళ్ళ గతి?

ప్రశ్నించారు శిష్యుడ్ని

గంగపాలే పెదవి విరిచాడు రామశర్మ

అవదాన్లుగారు ఆలోచనలో పడ్డారు రెండు నిముషాలయేక-

ఒరేయి! ప్రెసిడెంటుగారింటికి వెళ్ళు ఆయన్ని తీసుకుని హెడ్ మాష్టరు గారింటికి వెళ్ళి ఆయనతో చెప్పి స్కూలు తాళాలు తీయించు నది ఒడ్డున కాపురం వుండే వాళ్ళందర్నీ ఈ రాత్రికి ఆ స్కూల్లో వుండమను

ఆయన దోరణికి అందరూ ఆశ్చర్య పోయారు

* * *

తెల్లవారు జామయింది

కుంభవృష్టి కురుస్తూనే వుంది

సూరమ్మగారు తోడికోడలు మడి కట్టుకున్నారు

ఆ రాత్రి నదికి బాగా వరదొచ్చింది

ఊరు సగానికి పైగా మునిగి పోయింది

కలవారి ఈ లోగిళ్ళకి పరవాలేక పోయింది గాని

ఆ పాటి ఈపాటి వాళ్ళ ఇళ్ళన్నీ మునిగిపోయాయి

అవధాన్లు గారిల్లు ఎత్తు ప్రదేశంలో ఉండడం వలన ఆయనింటికి వరద ప్రమాదం లేక పోయింది

వరద భయం వలన ఊళ్ళో వున్న బీద బిక్కీ ఆయనింటి చుట్టూ చేరేరు కాని ఎవరికీ ఆశ్రయం అడగడానికి ధైర్యం చాలలేదు పైగా ఆ వేళ వాళ్ళింట్లో తద్దినం తాము చూస్తే అది మైలవుతుంది అలాగే వర్షంలో నిలబడ్డారు జనమంతా

అపరాహ్ణం అయింది

దీక్షితు లగ్రహారానికి కూడా వరద ప్రమాదం సంభవించడం వలన అక్కడ నుండి రావలసిన భోక్తలు రాలేదు

ఏం చెయ్యాలో ఎవరికీ బోధ పడడంలేదు.

అవధాన్లుగారు కొడుకుని పిలిచేరు

"ఒరేయి పెద్దవాడా! పెరటి తలుపులు తీయించు వర్షంలో తడుస్తున్న వాళ్ళందర్నీ ఆ పాకల్లోకి వెళ్ళమను అమ్మతో చెప్పి నాలుగయిదు కుంచాల చొప్పున అయిదారు వాయిలు దించి అన్నం వండమను పాకలో చేరిన వాళ్ళందరికీ ఇంత ప్రసాదం పెట్టమను

చాలా ప్రశాంతంగా తల్లి తద్దినం తగలడి పోతోందేనని ఎంత మాత్రం బాధ పడకుండా కొడుక్కి పురమాయించేరు అవధాన్లుగారు

అనాచారం చేసినా పిత్రు కార్యాలకి అవరోధం కలిగినా ఎంత మాత్రమూ సహించలేని తన తండ్రి మరో జాతి వాళ్ల నెవళ్లనో తన ఇంట్లోకి తీసుకు-వచ్చి తిండి పెడుతున్నాడు అది కూడా ఒక ప్రక్క తన తల్లి తద్దినం అభాసయి పోతూన్న సమ-యంలో!!

ఆశ్చర్య పోవడం కూడా మర్చి పోయాడా కొడుకు!

పెరట్లో కొంజా తలుపు తీసేరు బీద బిక్కి జనం అంతా పెరట్లో వున్న పెద్ద పాకలోకి చేరేరు

ప్రకృతి భీకరంగా గర్జిస్తూనే వుంది కుభ వృష్టి కురుస్తూనే వుంది నదికి వరద హెచ్చయింది స్కూల్లోకి చేరినంత మంది స్కూల్లోకి చేరారు అవధాన్లుగారి పెరట్లో కూడా చాలామంది తలదాచుకున్నారు

పాకలో చేరిన వాళ్ల కోసం బస్తా బియ్యం వార్చేరు సూరమ్మగారు, తోటికోడలు, కోడళ్ళు కలసి

తమ్ముడు, కొడుకులు, మనవలు వడ్డించడంతో-అంత వర్షంలోనూ పాకలో చేరిన వాళ్లందరూ తృప్తిగా తిన్నారు అవదాన్లుగారే దగ్గరుండి వాళ్లందరికీ కావలసినవి వడ్డించేరు

అత్తగారి తద్దినం అభాసయి పోయిందని సూరమ్మ గారికైతే మహాదు ఖంగా వుంద పిత్రు కార్యం బగ్నమైతే ఎంత మాత్రమూ సహించలేని అవధాన్లుగారు అంత తాపీగా వచ్చిన వాళ్లందరికీ భోజనం పెట్టిస్తూ వాళ్ల యోగ క్షేమాలు కనుక్కుంటూ తల్లి తద్దినమ్మనే సంగతే మరచి పోయి-నట్లు పట్టించుకోకుండా తిరగడం చూస్తూ వుంటే ఆవిడకి చాలా ఆశ్చర్యంగా వుంది అయితే మనసులో భావాలు మనసులోనే తప్ప బయటకు చెప్పే సాహసం ఆవిడకేగాదు ఆ యింట్లో ఎవరికీ లేదు

సాయంత్రానికి వర్షం కొంచెంతగ్గింది రాత్రికి బాగా తగ్గింది వరద పొంగు కూడా తగ్గుముఖం పట్టింది

అవదాన్లు గారికి కృతజ్ఞతలు చెప్పుకుని అందరూ వెళ్లి పోయారు

* * *

తెల్లవారింది

ప్రకృతి పూర్తిగా మామూలు స్థితికి వచ్చింది

నరసింహావదాన్లుగారు జపం పూర్తి చేసుకుని దేవుడి పటం ముందు నుండి లేచారు

సూరమ్మగారు వేడి పాలందించేరు

ప్రశాంతిగా వాలు కర్చీలో కూర్చుని పాలు తాగే-రాయన

మహా పండితుడు అన్నీ తెలిసినవాడు, కర్మిష్ఠి అయిన అవదాన్లుగారు తల్లి తద్దినం అభాసు చేసుకుని అడ్డమైన వాళ్లకీ ఆతిద్యం ఇచ్చేరని ఊళ్లో కొంచరనుకుంటున్నారు

తలుపు వార నిలబడి తలవంచుకుని ఆ నాలుగు ముక్కలూ అనేసారు సూరమ్మగారు నిన్నటి నుండి మనసు పహించుకు పోతోందావిడకి

పాలు తాగేసి గ్లాసు ఎదురు గుండా వున్న బల్లమీద పెట్టారు అవధాన్లుగారు రాత్రి నుండి భార్య వైఖరి గమనిస్తూనే వున్నారాయన ఆయన పెదవుల మీద చిరుదరహాసం మెరిసింది

వెర్రిదానా! నిన్నటి తుపాను వరదలకి కొన్ని వేలు లక్షల మంది నిరాశ్రయులై పోయారు మన గ్రామంలో కొన్ని వందల మందికి ఇళ్ళు మునిగి పోయాయి వాళ్లందరూ అన్నార్తులే అమ్మా! ఆకలి! అంటూ ఇంటికి వచ్చిన అర్థిని వాడి కడుపు నింపకుండా ఎన్నడైనా నా తల్లి పంపించిందా! అటువంటి కారుణ్యమూర్తి అయిన నా తల్లి తద్దినం నాడు నా పెరట్లోనే కొన్ని వందల మంది ఆకలితో నకనకలాడుతూ వుంటే వాళ్ల సంగతే పట్టించుకోకుండా నేను నా తల్లి తద్దినం పెడితే మాత్రం ఆవిడ సంతోషిస్తుందా! అందుకే ఆవిడ ఆత్మకి సంతృప్తి కలిగే విధంగానే నేను ప్రవర్తించానే తప్ప మరే విధమైన అప్రాచ్యపు పనీ చెయ్యలేదు. ఆకలిగొన్న వాడికి ఇంత అన్నం పెట్టడమే ఈశ్వర పూజ అదే పిత్రు దేవతకు ప్రీతి అయినా అబ్దికం పెట్టడం సాధ్యం గానప్పుడు శాస్త్రాలు కొన్ని ఆపద్ధర్మాలు సూచించాయి తద్దినం కుదరక పోతే శరకం పెట్టవచ్చు అదీ కుధరకపోతే హిరణ్యం ఇవ్వవచ్చు నువ్వు కుశంకలు పెట్టుకుని మనసును పాడు చేసుకోకు ఇప్పుడే వస్తాను తలుపేసుకో

ఉత్తరీయం పైన వేసుకుని శివాలయం వైపు అడుగు లేసారు నరసింహావధాన్లుగారు

ఆయన వెళ్లిన వైపే చూస్తూ మనసులోనే ఆయనకి చెయ్యెత్తి నమస్కరించారు సూరమ్మ-గారు □

# అమరప్రియదర్శిని

ఛీఛీ యెంతటి నీచహీనమగు దుశ్చేష్టన్ వింటిమిన్ గంటిమిన్
నీచుక మూర్ఖులు హీన రాక్షసులు దుర్నీతిన్నిందిరాగాంధినిన్
త్రాచుక రేచులు రేగినట్టులుగ సంత్రాసమ్ముగా జంపుచున్
ఆచూపించిరి మాతనిర్గతక దుష్టా గ్రమ్మునున్మాదులై
ఓరీ దుష్ట కిరాతులారా! వినలేరో, చూడలేరో, స్ఫృహన్
లేరో, భ్రాంతిని నున్న వారో, భవినుల్లేఖ్య కృతంబై సుధా
సారం బస్మదుదార సత్య సమతా సర్వోదయా భావ సం
భారాయాను సురాజ్య నేత్రి సుఖ సౌభాగ్య ప్రదన్నిందిరన్
ఘోరంబైన విధిన్ వధింపజనునే కూలుండహో దుర్గతిన్
జీవము లేని దేహముగ, చీకటి క్రమ్మిన కాళరాత్రిగా,
రావము లేని యిళ్ళులు, విరామము లేని విలాప రావముల్
ఏవల జూడ నయ్యెడల నిబ్బడి ముబ్బడిగాగ దేశమం
దావరి తమ్ములయ్యె ప్రియమౌ ప్రియదర్శిని కన్ను మూయగన్
ఆనాడు మత మూర్ఖుడై ఒక దుర్మార్గ
చరితుండు గాంధీని జంపినాడు
ఈనాడు మత మూర్ఖు లిర్వురొక్కుమ్మడిన్
జాత్యేందిరాగాంధి జంపినారు
నాడు వాడతి భక్తి నటియించి మోసాన
జాతి పితన్ ప్రేల్చి చంపినాడు
నేడంగ రక్షకులే నీచులై వంచనన్
జాతి నేత్రినె కాల్చి చంపినారు
నాటికిని నేటికి ఎన్నెన్ని నాళ్ళు గడిచె
నైన మత మూర్ఖ తిండైన నణగలేదు
మానవత్వమ్ము తరుగుట మానలేదు
సమత వాదమ్ము ముందుకు సాగలేదు

—డా. అంతటి నరసింహం